తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
09 ఆగస్టు 2026

# రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి




- ఆయిల్ పామ్ సాగుతో కూడా మంచి ఆదాయం
- ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కురిసే అవకాశం తక్కువ
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 8(జనంసాక్షి);** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి ప్రస్తుతం పెద్ద ఎత్తున వరద వస్తున్నప్పటికీ ఆ నీటిని జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపుకొని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. జూరాల ప్రధాన కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ వరద తగ్గుముఖం పడితే కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడతాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ మొత్తం కాలువల ద్వారా నీటి విడుదల చేసే విషయంపై స్పష్టత లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఆయకట్టు రైతులకు వరి సాగు చేయవద్దని ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. ఈనెల 7న హైదరాబాదు నుంచి పలువురు మంత్రులు, అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవి ముగిసే వరకు ప్రజల తాగు నీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వరద నీటితో ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపుతున్నట్లు తెలిపారు.కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసర్లు మినుములు, కూరగాయలు, తదితర ఆరుతడి పంటలతో కూడా రైతులకు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భరత పప్పు దినుసుల పథకం కింద సబ్సిడీకి కందులు, మినుముల విత్తనాలు అందజేస్తున్నందున జిల్లా రైతులు తమ సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి పంటకు నాలుగు నెలల పాటు మడులలో నిత్యం రెండు ఇంచుల నీళ్లు నిలువ చేయాల్సి వస్తుందని, కాబట్టి తక్కువ నీటితో పండించుకునే ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. పంటల వైవిధ్యంతోనే నేల సారవంతత కూడా పెరుగుతుందని, పంట మార్పిడి విధానాలు రైతులకు మేలు చేస్తాయని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేశారన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పందిరి కూరగాయల సాగుకు పందిరి నిర్మించుకునేందుకు ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు ఐదు యూనిట్ల చొప్పున,యూనిట్ కు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఆయిల్ పామ్ పంటల సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్యన అంతర పంటలుగా మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్ప కాలిక పంటలతోనూ లబ్ధి పొందవచ్చన్నారు. పామ్ గెలలు నాలుగో సంవత్సరం నుంచి వస్తాయని, అప్పుడు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీకి మొక్కలను అందజేయడంతో పాటు బిందు సేద్య పరికరాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వరి వంటి సాంప్రదాయ పంటలకు బదులుగా ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్న పామ్ తోటలతో ఆర్థిక పురోగతి సాధించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

## అక్రమ ఇసుక మాఫియాకు పచ్చని పంట నాశనం





**రాజాపూర్, ఆగస్టు 8(జనంసాక్షీ):** మహబూబ్నగర్ జిల్లా రాజాపూర్ మండలం మల్లేపల్లి శివారులోని దుందుభి వాగు నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా మట్టిని కడిగి ఫిల్టర్ ఇసుకను తయారుచేసి టిప్పర్ల ద్వారా రాజధానికి తరలిస్తున్నారని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని రైతులు భాస్కర్ రెడ్డి, పరిసప్రాంతాల్లో ఉన్న రైతులు డిమాండ్ చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేనం. 159,160,161 రైతు దచాని విజయ భాస్కర్ రెడ్డి తన వరి నారుమడి ధ్వంసం చేసిన ఇసుక వాహనదారులను పట్టుకొని కటిన చర్యలు తీసుకోవాలని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## మాజీ మంత్రిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదు

- నీళ్లపై అవగాహన లేని మేఘారెడ్డి
- తెలంగాణకు తెలంగాణ ముఖ్యమంత్రి ఉన్నాడా లేక ఆంధ్ర ముఖ్యమంత్రి ఉన్నాడా?
- గుడిపల్లి రర్వాయర్ వద్ద విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు

మిగతా 09లో..



**రేవల్లి, ఆగస్టు 08(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేసిన అనాలోచిత వ్యాఖ్యలు సరికావని గుడిపల్లి రిజర్వాయర్ దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు శివరాం రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అల్టిమేటం తో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి పంపు హౌసులు ప్రారంభించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉన్నాడా లేకపోతే ఆంధ్ర ముఖ్యమంత్రి ఉన్నాడా అని విమర్శించారు. గడిచిన 15 రోజుల ముందు కాల్వకు నీళ్లు ఇస్తే రైతులు వరి నారుమల్లు పోసుకునేవారని, ఇప్పటికే సాగుకు 20 రోజులు సమయం ఆలస్యమైందని సమయానికి సాగునీరు ఇస్తే ఎరువులు సరఫరా, సమయానికి యూరియా, 500 బోనస్ ఇవ్వాల్సి వస్తుందని ఆలస్యంగా కెనాలకు సాగు నీరు ఇచ్చారని అన్నారు. పాలమూరు బిడ్డ అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేస్తే బీఆర్ఎస్ పార్టీకి పేరు వస్తుందని పాలమూరు రంగారెడ్డి పెండింగ్ పనులను పూర్తి చేయడం లేదని అన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం ఎదుట అపరిశుభ్రత రాజ్యం..!

- చెత్తకుప్పలు.. మురుగు నీరు.. దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల అసంతృప్తి





**కోహిర్, ఆగస్టు 8 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట అపరిశుభ్రత నెలకొంది. కార్యాలయ పరిసరాల్లో చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రతకు ఆదర్శంగా నిలవాల్సి ఉండగా, ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుటే ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కార్యాలయం ఎదుట పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలే పరిశుభ్రతకు ఆదర్శంగా నిలిస్తే ప్రజల్లో మరింత అవగాహన, నమ్మకం పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## రాయిని దూరం చేస్తే... మా బతుకులు ఆగిపోతాయి!

- మెదక్ జిల్లా అధ్యక్షుడు దండుగుల దుర్గా సాయిలు
- భూమి, ఇళ్ళు, ఉపాధి కల్పించాలి...
- అటవీశాఖ పర్యవేక్షణలో రాయి కొట్టుకునే అవకాశం కల్పించాలని డిమాండ్



**కొల్చారం, ఆగస్టు 8 (జనంసాక్షి):** కొల్చారం మండలం పోతంచెట్టిపల్లి చౌరస్తాలోని హనుమమ్మ ఫంక్షన్ హాల్‌లో శనివారం వడ్డెర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మెదక్ జిల్లాలోని వివిధ మండలాల వడ్డెర సంఘం అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొని వడ్డెరల సమస్యలు, జీవనోపాధి, ఉపాధి అవకాశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మెదక్ జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు దండుగుల దుర్గా సాయిలు మాట్లాడుతూ.. వడ్డెరల జీవనం రాళ్లతో ముడిపడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తాతల కాలం నుంచి తండ్రుల వరకు, ప్రస్తుతం తమ కుటుంబాలు కూడా రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. అయితే ప్రస్తుతం రాయి కొట్టే వృత్తికి అడ్డంకులు ఏర్పడటంతో వడ్డెర కుటుంబాలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

మెదక్ జిల్లాలోని అనేక వడ్డెర కుటుంబాలకు కనీసం గుంట భూమి కూడా లేదని, చాలామందికి సొంత ఇళ్లు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. “మా బతుకు రాయిపైనే ఆధారపడి ఉంది. రాయి కొట్టడమే మా జీవనోపాధి. ఆ వృత్తిని కూడా అడ్డుకుంటే మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలి?” అని ప్రశ్నించారు.

మిగతా 09లో..

## టాటా మోటార్స్ షోరూమ్ ప్రారంభించిన ఎండి మైపాల్ రెడ్డి జయప్రదం



**రామాయంపేట, ఆగస్టు 8 (జనం సాక్షి):** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో టాటా మోటార్స్ 8వ సబ్-బ్రాంచ్‌ను శనివారం అత్యంత ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ మహిపాల్ రెడ్డి, జయప్రద ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. జీఎం పార్థసారథి, బీఎం నరేష్, నిజామాబాద్ సేల్స్ మేనేజర్ గోవర్ధన్, అకౌంట్ మేనేజర్ వంశీకృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండీ మహిపాల్ రెడ్డి, జయప్రదలు,మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు నాణ్యమైన వాహనాలు, మెరుగైన సేవలు అందుబాటులోకి తెచ్చేందుకే ఈ బ్రాంచ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.?షోరూమ్‌లో కస్టమర్ల ఆదరణ పొందిన టియాగో, టిగోర్, పంచ్, ఆల్ట్రోస్, నెక్సాన్, కర్వ్, సియెర్రా, హారియర్, సఫారీ మోడల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రారంభోత్సవం సందర్భంగా ప్రముఖ నెక్సాన్ కారు కొనుగోలుపై రూ. 1,00, 000 వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ బంపర్ ఆఫర్ ఈ నెల ఆఖరు వరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. టెస్ట్ డ్రైవ్, బుకింగ్స్ కోసం 9848958399, 8328147984 నంబర్లలో సంప్రదించవచ్చు.

## బైక్‌ను ఢీకొన్న ఆటో.. ఇద్దరు దుర్మరణం





**కోహీర్, ఆగస్టు 8 (జనం సాక్షి):** ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని మనియార్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మనియార్‌పల్లి గ్రామానికి చెందిన జగన్నాథం (23) బైక్‌పై గ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో (టీఎస్ 15 యూసీ 5959) ఢీకొంది.ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న జగన్నాథం అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన పద్మమ్మ (40) తీవ్రంగా గాయపడింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జగన్నాథం తండ్రి నాగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోహీర్ ఎస్ఐ నరేష్ తెలిపారు.

## వెంకటేశ్వరపల్లి గ్రామంలో దోమల నివారణ చర్యలు



**కోహెడ, ఆగస్టు 09(జనంసాక్షి):** మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామములో సర్పంచ్ పండుగ శ్రీకాంత్, గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శిల ఆధ్వర్యంలో గ్రామంలోని వీధులలో దోమల నివారణ కోసం గడ్డిమందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామం లో ప్రతి ఒక్కరు వారి వారి ఇంటి ముందు, చుట్టుపక్కలో వున్న గడ్డి, పిచ్చిమొక్కలు లేకుండా చదును చేసుకోవాలి అన్నారు. తద్వారా దోమలు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామమును పరిశుభ్రంగా ఉంచాలని, ఆదర్శంగా గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని అన్నారు. గ్రామప్రజలు అందరు సహకరించి గ్రామ అభివృద్ధికి సహరించాలని ఆయన కోరారు.

## కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి: పులగుర్ల కృష్ణారెడ్డి సర్పంచ్ కుర్మిద్ద

- **15లోగా అర్హులు దరఖాస్తు చేయాలి**



**కల్వకుర్తి,ఆగస్టు08,(జనంసాక్షి):** కొత్త పింఛన్ల కోసం అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కుర్మిద్ద సర్పంచ్ పులగుర్ల కృష్ణారెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ నెల 15వ తేదీ వరకు కొత్త పింఛన్ల దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అనంతరం అర్హతలను పరిశీలించి పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వితంతువులు,దివ్యాంగులు తదితర అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పింఛన్ అందేలా అవసరమైన సహకారం అందిస్తామని సర్పంచ్ పులగుర్ల కృష్ణారెడ్డి తెలిపారు.

## పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగం సాధించాలి



- **లక్ష్యంతో శ్రమిస్తే విజయం ఖాయం**
- **చదువుతో పాటు రోజువారీ ఫిజికల్ ప్రాక్టీస్ తప్పనిసరి**
- **యువత పోలీస్ ఉద్యోగాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాల: కొత్త కాపు గోవర్ధన్ రెడ్డి**

**కోహీర్, ఆగస్టు 8 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌ను కోహీర్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకుని తమ లక్ష్యాన్ని చేరుకోవాలని సజ్జాపూర్ బీఆర్ఎస్ నాయకుడు కే. గోవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.

పోలీస్ ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా, పూర్తి ఏకాగ్రతతో సన్నద్ధం కావాలని ఆయన సూచించారు. పోలీస్ ఉద్యోగం అనేది కేవలం ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. కోహీర్ నియోజకవర్గ యువతలో అపార ప్రతిభ ఉందని, సరైన లక్ష్యం, క్రమశిక్షణ, పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధించడం సాధ్యమేనని అన్నారు. అభ్యర్థులు కేవలం రాత పరీక్షలపైనే కాకుండా శారీరక సామర్థ్య పరీక్షలు (ఫిజికల్ ఈవెంట్స్) పైనా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ప్రతిరోజూ క్రమం తప్పకుండా చదువుతో పాటు పరుగు, వ్యాయామం వంటి శారీరక సాధన కూడా కొనసాగించాలని, సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధన కోసం కృషి చేయాలని కోరారు. అన్ని దశల పరీక్షల్లో విజయాన్ని సాధించి పోలీస్ ఉద్యోగాలు పొంది కోహీర్ నియోజకవర్గానికి, నిరుద్యోగ యువతకు ఆయన యువత పోలీస్ ఉద్యోగాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలి.

## వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై రంజిత్‌కుమార్

- **ప్రజలు, రైతులు, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి**




**నర్సాపూర్, ఆగస్టు 6 (జనంసాక్షి):** వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు, రైతులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని శనివారం నర్సాపూర్ ఎస్సై రంజిత్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాలు, వాగు లు, కాలువలు, చెరువులు, నీటితో నిండిన కల్వర్టుల వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. రైతులు పొలాల్లోని విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తెలిపారు. తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని హెచ్చరించారు. వర్షపు నీటితో ఉద్ధృతంగా ప్రవహించే వాగులు, కాలువలు, కుంటలను దాటే సాహసం చేయవద్దన్నారు. పంటలు, వ్యవసాయ పరికరాలు, ఎరువులను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో అత్యవసరమైతే తప్ప పొలాలకు వెళ్లకుండా ఉండటం మంచిదన్నారు.

వాహనదారులు వర్షాల సమయంలో వాహనాల వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. రహదారులపై నీరు నిలిచిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. పిల్లలను చెరువులు, కుంటలు, వాగులు, నీటితో నిండిన ప్రాంతాల వద్దకు ఒంటరిగా వెళ్లనివ్వకూడదన్నారు.వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను నివారించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు సంప్రదించాలని తెలిపారు.

## శాకాంబరీ మాతగా పెద్దమ్మ దర్శనం





**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 8 (జనంసాక్షి):** ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా శనివారం బిహెచ్‌ఈఎల్‌లోని పెద్దమ్మ అమ్మవారిని అన్ని రకాల కూరగాయలతో అలంకరించగా పెద్దమ్మ తల్లి శాకాంబరీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అభిషేకాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి మహిళలు శ్రీ లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఆలయ కార్య నిర్వహణ సంగం నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా... బీహెచ్ ఈఎల్ పరిశ్రమ ఈడి శ్రీనివాసరావు**

బిహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి అందరం కలసి కట్టుగా కృషి చేయాలని, అందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని పరిశ్రమ ఈ.డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెద్దమ్మ ఆలయంలో ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలకు ఈ డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. పెద్దమ్మ తల్లి దయవల్ల కర్మాగారంలో అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అందరూ కూడ సుభిక్షంగా ఉన్నారన్నారు. వేడుకల్లో బిహెచ్ ఈ ఎల్ పరిశ్రమ జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ల ,హెచ్,ఆర్ హెడ్ కార్పొరేట్ శ్రీధర్, నిర్వాహణలో మందిర అబివృద్ధి కమిటీ వైస్ ఛైర్మన్ రాజేశ్వరాచారి, సెక్రెటరీ ప్రవీణ్, కోశాధికారి విశ్వనాథం . ప్రచార కార్య దర్శులు వేణుగోపాల్, మాణిక్ రెడ్డి, కిషన్,స్వామి, వీణ నారాయణ, దేవార్జున, దేవేంద్ర చారి. భాస్కర్, మధుసూదన్, రాము, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూముల ఆక్రమణల ఆరోపణలపై ఫిర్యాదు

- **విచారణ చేపట్టిన సంగారెడ్డి దేవాదయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావు**
- **రెవెన్యూ శాఖాధికారులతో సమాచారాన్ని సేకరించి విచారణ చేపడతాం**



**న్యాల్‌కల్, ఆగస్టు 08,(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా, న్యాల్‌కల్ మండలం, రేజింతల్ గ్రామంలోని శ్రీ ఊరడమ్మ దేవాలయానికి చెందిన భూములు ఆక్రమణల ఆరోపణల నేపథ్యంలో తక్షణమే విచారణ చేపట్టి, దేవాలయ భూములను కాపాడాలని స్థానిక గ్రామానికి చెందిన యువభక్తుడు జైపాల్ ఇటీవల జిల్లా కలెక్టర్, దేవదాయ శాఖాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. భక్తుడి ఫిర్యాదు మేరకు.. దేవాదయ శాఖ సహాయ కమిషనర్ విజయ రామారావు ఆదేశం మేరకు.. సంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావు సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం ఊరడమ్మ దేవాలయం, సమీపంలోని పలు గ్రామ దేవాలయాలను పరిశీలించారు. త్వరలోనే స్థానిక రెవెన్యూ అధికారులు, దేవాదయ శాఖ సిబ్బందితో ఆలయానికి సంబంధించిన భూమి వివరాలను పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి, విచారణ చేపడతామని, విచారణ చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్, దేవాదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఇన్స్ పెక్టర్ రంగారావు తెలిపారు.

## నూతన పింఛన్ల లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ శ్రేణులు ముందుండాలి

• కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్

**కొల్చారం, ఆగస్టు 8 (జనంసాక్షి):** కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, మాజీ సర్పంచులు నూతన పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని అన్ని మండలాల్లో నూతన పింఛన్లను మంజూరు చేసేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. గత పదేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం నుంచి ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులను నేరుగా తీసుకెళ్లి సంబంధిత దరఖాస్తు ఫారాలను పూర్తిచేయించి పంచాయతీ కార్యదర్శికి అందజేయాలని కోరారు. ఈ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ముందుండి ప్రజలకు సహకరించాలని సూచించారు. పింఛన్ల దరఖాస్తు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, సంబంధిత నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరించే బాధ్యత తీసుకుంటామని పేర్కొన్నారు. నూతన పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక కాంగ్రెస్ పార్టీకి అత్యంత ముఖ్యమైన కార్యక్రమమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాగుల గారి మల్లేశం గౌడ్ కోరారు.



## బోనాల ఊరేగింపులకు డీజేలకు అనుమతి లేదు

**తూప్రాన్, ఆగస్టు 8(జనంసాక్షి):** తూప్రాన్ పట్టణంలో ఆదివారం నుంచి జరగనున్న బోనాల ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, భక్తులకు మరియు సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తూప్రాన్ శ్రీ వెంకట్ రాజ గౌడ్ తెలిపారు.
ఈ సందర్భంగా తూప్రాన్ సీఐ ఎస్ఐ గంగరాజు మున్సిపల్ సిబ్బంది కలిసి ఉత్సవాల మార్గాలు, ప్రధాన కూడళ్లు, దేవాలయాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టారు.
బోనాల ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. ఉత్సవాల సందర్భంగా డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్‌కు ఎలాంటి అనుమతి లేదు. అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.
అదేవిధంగా పలారం బండి నిర్వహించదలచిన నిర్వాహకులు ముందస్తుగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని చెప్పారు. పోలీసుల అనుమతి లేకుండా పలారం బండ్లు నిర్వహించడం, ఊరేగింపులు చేపట్టడం చేయరాదని సూచించారు. అనుమతి పొందిన కార్యక్రమాలు కూడా పోలీసుల సూచనలు, నిబంధనలకు అనుగుణంగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తెలిపారు.
అలాగే ఊరేగింపులు మరియు ఇతర కార్యక్రమాల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా పోలీసుల సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.
బోనాల ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని తూప్రాన్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## అక్రమంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**అచ్చంపేట, జులై 8 (జనంసాక్షి):** పలకపల్లి గ్రామం నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ (రేషన్) ద్వారా సరఫరా చేసిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని అధికారులు పట్టుకున్నారు. గురువారం రాత్రి అందిన సమాచారం మేరకు డిప్యూటీ తహసీల్దార్ ఎన్ఫోర్స్‌మెంట్ ఏ. హేమ్లా నాయక్, పోలీస్ కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్, మాథ్యూస్ తదితరులు పలకపల్లి నుంచి అచ్చంపేటకు వచ్చే రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో టీఎస్31యూ 2726 నంబర్ గల బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో సుమారు 32 ప్లాస్టిక్ బ్యాగుల్లో 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. పలకపల్లి గ్రామంలోని తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, అధిక ధరకు విక్రయించి లాభాలు పొందేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు.
వాహనం డ్రైవర్, యజమానిగా తిక్కల శ్రీకాంత్, తండ్రి కృష్ణయ్య, లక్మారం గ్రామంగా గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. పట్టుబడిన బొలెరో వాహనంతో పాటు పీడీఎస్ బియ్యాన్ని అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.
డిప్యూటీ తహసీల్దార్ ఎన్ఫోర్స్‌మెంట్ ఏ. హేమ్లా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు

## సప్తాహ భజన ప్రారంభించిన ఎమ్మెల్యే

**మల్దకల్ ఆగస్టు 8 (జనంసాక్షి):** సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం సప్తాహ భజన కార్యక్రమాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి అఖండ జ్యోతిని వెలిగించి సప్తాహ భజన కార్యక్రమం ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరుణ దేవుని కరుణ ప్రతి ఒక్కరికి ఉండాలని శ్రీ తిమ్మప్ప స్వామి ఆశీస్సులతో సుభిక్షంగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. అనంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతలముని దేవాలయ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ధీరేంద్ర దాస్, మధుసూదనాచారి,రమేష్, సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, పట్వారీ అరవిందరావు, బాబురావు,జమ్ములమ్మ దేవాలయ చైర్మన్ పురేందర్, అన్నదాత నల్లారెడ్డి, చంద్రశేఖరరావు, గద్దం కృష్ణారెడ్డి, సీతా రామ్ రెడ్డి,పటేల్ ప్రభాకర్ రెడ్డి, సత్యరెడ్డి,ప్రభాకర్ రెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి,విక్రమ్ సింహారెడ్డి,ఏక్లాస్ పురం నాగేశ్వర్ రెడ్డి,గట్టువిజయ్ కుమార్,జంబురామన్ గౌడు, చంద్రశేఖర్ రెడ్డి, కొంకతి నరేందర్, మధు, అజయ్,వెంకటన్న,ఉప్పరి నారాయణ,సవారన్న, రాముడు, హార్మోనిస్ట్ రాఘవేంద్ర చారి, ప్రసాద్ ,భజన మండలి సభ్యులు,వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.



## అలుగులు పారుతున్న చెక్ డ్యామ్‌లు

• నిండుకుండల్లా చెరువులు
• సంతోషంలో అన్నదాతలు

**వెల్దుర్తి, ఆగస్టు 8 (జనంసాక్షి):** వెల్దుర్తి మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మండలంలో ఉన్న చెక్ డ్యామ్‌లో చెరువులు అలుగులు పారడంతో మండల వ్యాప్తంగా రైతన్నలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జూన్ జూలై మాసాలలో వెనక్కి పట్టిన వర్షాలు ఆగస్టులో రైతులను ఆనందపరుస్తున్నాయి ముఖ్యంగ.. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగ వరినార్లు ఇప్పటివరకు తక్కువగా వేయడంతో ఈ వర్షాలతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. దీంతో రైతన్నల కళ్ళల్లో ఆనందం వ్యక్తపరుస్తున్నారు



## కోహెడ మండలానికి 7 కోట్ల 20 లక్షలు విడుదల పట్ల కృతజ్ఞతలు

**కోహెడ, ఆగస్టు 09(జనంసాక్షి):** కోహెడ మండలానికి భారీ నిధులు విడుదల చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. హుస్నాబాద్ నియోజక వర్గంలో రోడ్ల అభివృద్ధి, బ్రిడ్జిల నిర్మాణం కోసం కోహెడ మండలానికి 10 పనులకు 7.20 కోట్ల భారీ మొత్తంలో నిధులు మంజూరు కావడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పథం లో రాష్ట్రంలో హుస్నాబాద్ నడవడం వెనుకబడిన నియోజక వర్గాన్నీ హుస్నాబాద్ శాసన సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న పొన్నం ప్రభాకర్ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని ఆయన తెలిపారు.



## చేర్యాల మాజీ జడ్పీటీసీ సుంకరి సరితకు కన్నీటి వీడ్కోలు

• మాజీ మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్‌కు పరామర్శ





**చేర్యాల, ఆగస్టు 08(జనంసాక్షి):** చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సుంకరి సరిత (44) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలియగానే ఆకునూరు గ్రామంలో విషాదం నెలకొంది. శనివారం పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు ఆమె పార్థివ దేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. 2014 నుండి 2019 వరకు జడ్పీటీసీగా పనిచేసిన సరిత చేర్యాల మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సేవలో చురుగ్గా పాల్గొన్నారని ప్రముఖులు కొనియాడారు. ఆమె సేవలను స్మరించుకుని కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. అనంతరం ఆమె భర్త, చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్ ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు పరామర్శించి ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి మనోధైర్యం కల్పించాలని కోరారు. సుంకరి సరిత మృతితో చేర్యాల మండలం ఒక ప్రజా నాయకురాలిని కోల్పోయిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధిపేద ప్రజలకు వరం

• చెక్కులు అందజేసిన మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి

**ఉర్కొండ, ఆగస్టు 08, (జనంసాక్షి);** ముఖ్యమంత్రి సహాయ నిధి బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు ఒక వరం లాంటిదని జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకారంతో మంజూరైన సుమారు
2,86,500 లక్షల రూపాయల చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డి శనివారం రోజు అందజేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల దరఖాస్తులను పరిశీలించిన ప్రభుత్వం, సహాయ నిధిని మంజూరు చేసింది.అవసరమైన వారికి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, బడుగు బలహీన వర్గాలకు పెద్ద అండగా నిలుస్తుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామస్తులు, గ్రామ నాయకులు మాజీ సర్పంచ్ అనిల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# సికింద్లాపురం దేవస్థానంలో జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు



**శివ్వంపేట, ఆగస్ట్ 8 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ శివారులో దట్టమైన అడవి గుట్టల మధ్యాన స్వయంభూగా వెలసిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానంలో శనివారం జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ నీలిమ ఆమె కుటుంబ సమేత స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వారి వ్రతాన్ని జరుపుకున్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలోకి జిల్లా జడ్జి నీలిమ చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. పూజ ముగిసిన తర్వాత స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి సారా శ్రీనివాస్, ప్రధాన పూజారి ధనుంజయ శర్మ, జూనియర్ సహాయకులు ఎస్. నరసింహారెడ్డి ఆలయ అర్చకులు విద్యాకర్ చారి పాల్గొన్నారు.

# వెంకటాపూర్‌లో ఘనంగా దుర్గామాత కల్యాణం



**రామాయంపేట, ఆగస్టు 8 (జనంసాక్షి):** మెదక్ జిల్లా రామాయంపేట మండలం వెంకటాపూర్ (ఆర్) గ్రామంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శనివారం దుర్గామాత అమ్మవారి కల్యాణ మహోత్సవం, గ్రామ సర్పంచ్ ఉమా సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు చౌడి రవితేజ బృందం, చేత ఈ దుర్గామాత అమ్మవారి కళ్యాణ మహోత్సవం, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళ భక్తులు అమ్మవారి మొక్కుబడిగా అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండారు మహేందర్ రెడ్డి. శ్రీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొని వచ్చిన భక్తులకి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# పాలమూరు పోరాట యోధుడు పండుగ సాయన్న




**రాజాపూర్, ఆగస్టు 8(జనంసాక్షీ):** మండల పరిధిలోని రంగారెడ్డి గూడ గ్రామంలో శనివారం తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలువబడే పండుగ సాయన్న జయంతి సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రం పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డిగూడ ముదిరాజ్ సంఘం సభ్యులు శివప్రసాద్, సర్పంచ్ భర్త ఆనంద్, శివ శంకర్, వెంకటేష్, ప్రవీణ్, వినోద్ కుమార్, లక్ష్మీ నారాయణ గౌడ్, సత్యం, మల్లేష్, పవన్,కిరణ్,ప్రెస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలపై సమరభేరి

# ఆగస్టు 10న జైల్‌భరోను జయప్రదం చేయాలి




**ఉప్పునుంతల, (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై సమరానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దేశ నాయక్ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న అచ్చంపేట పట్టణంలో నిర్వహించనున్న జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జైల్‌భరో కార్యక్రమం ప్రచారంలో భాగంగా ఉప్పునుంతల మండలంలోని కంసానిపల్లి, తాడూరు, కొరటికల్, వెల్లటూరు, తిప్పాపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రచార సభలు నిర్వహించినట్లు దేశ నాయక్ తెలిపారు. రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నాగరాజుతో పాటు గ్రామపంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాలకు రూ.31 వేలు పెయింటింగ్ విరాళం

**శివ్వంపేట, ఆగస్ట్ 8 (జనంసాక్షి):**



శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో ఉన్న మహంకాళి దేవాలయాన్ని బోనాల పండుగ దృష్టిలో పెట్టుకొని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగా సుందరంగా ముస్తాబు చేయడానికి బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి బుద్ధుల భిక్షపతి నడుం బిగించారు. అందులో భాగంగానే శనివారం తన సొంత డబ్బులు రూ.31 వేలు ఖర్చు చేసి ఆలయానికి పెయింటింగ్ వేయించారు. ఈ సందర్భంగా బుద్ధుల భిక్షపతి మాట్లాడుతూ ఏడు అమ్మవారి దీవెనలతో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నమన్నారు. దొంతి గ్రామంలోనీ మహంకాళి, దుర్గమ్మ, పోలేరమ్మ టెంపుల్ కు తన సొంత నిధులతో 31వేలు ఖర్చుపెట్టి పెయింటింగ్ అమ్మవారి చిత్రాలను వేయించడం జరిగిందన్నారు. ఆలయాల ముస్తాబుకు సహకరించిన బుద్ధుల బిక్ష పతిని దొంతి గ్రామ ప్రజలు అభినందించారు.

# బిఆర్ఎస్ కృషి వల్లే సాగుకు నీళ్లు




**పెబ్బేరు, ఆగస్టు 8 (జనంసాక్షి):** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టిఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, నాయకులు వాకిటి శ్రీధర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తాం అని తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలో వచ్చిన వీళ్ళకు కనీసం వ్యవసాయం పైన మినిమం అవగాహన కూడా లేదు. ఎలినో పోయి వర్షాలు పడి వాటర్ వస్తే ఎట్లా ఉపయోగించుకోవాలి అనే సోయి కూడా లేదు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అనుక్షణం ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు. నీళ్ల మీద, రైతుల మీద, వ్యవసాయం మీద బాధ్యత, మమకారం, సోయి లేని సన్నాసులు ఈ కాంగ్రెసోళ్ళు తాగునీటి కోసమే ఎల్లూరు, గుడిపల్లి, జొన్నలబొగుడ రిజర్వాయర్లు నింపేందుకు ప్రయత్నించారు. కానీ రైతులకు సాగునీరు ఇవ్వడానికి కాదు. ఇప్పటికి కూడా ఎక్కడా రైతులకు సాగునీరు విడుదల చేయడం లేదు.

# తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

- అంగన్వాడీ సూపర్ వైజర్ కవిత



**కోహెడ ఆగస్టు 09 (జనంసాక్షి):** మండలంలోని నకిరేకొమ్ముల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఉప సర్పంచ్ సిరిగిరి సూర్యకళ ఆధ్వర్యంలో అంగన్వాడి సూపర్వైజర్ కవిత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లికి మొదటగా వచ్చే ముర్రుపాల ప్రాముఖ్యత గురించి తెలిపారు. బిడ్డకు 6 నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని తెలిపారు. 7 నెలల నుండి బిడ్డకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలు 2 సంవత్సరాలు వరకు ఇవ్వాలి. తల్లిపాలు ఇవ్వడం వలన తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. బిడ్డ తల్లి పాలు తాగడం వలన తల్లికి కలిగే లాభాల గురించి తెలియజేశారు. బిడ్డ శారీరక, మాన సిక, ఆరోగ్య పెరుగుదలకు తల్లిబిడ్డల అన్యోన్య అనుబంధానికి తల్లి పాలే అత్యంత శ్రేష్టమైనది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ స్వరూప,వార్డ్ సభ్యురాలు సిరిగిరి సుమలత, గర్భవతులు, బాలింతలు అలాగే చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు



**రామాయంపేట, ఆగస్టు 8 (జనంసాక్షి):** రామాయంపేట మండల కేంద్రంలో బీసీ, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో పండగ సాయన్న 108వ జయంతి వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీసీనాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక కౌన్సిలర్ గజవాడ నాగరాజుతో పాటు నాయకులు చింతల స్వప్న స్వామి,దాకి స్వామి, కంభంపాటి విప్లవ కుమార్, దామోదర్ చారి, రాము, శ్రీశైలం తదితరులు పండగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజాసేవలో శశిధర్ రెడ్డి ముందడుగు అభినందనీయం: కాట శ్రీనివాస్ గౌడ్



**అమీన్పూర్, ఆగస్టు 8 (జనంసాక్షి):** ప్రజా అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి సేవలను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని నల్లూరి హైట్స్‌లో శశిధర్ రెడ్డి, ఆయన సతీమణి మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సుమారు 200 మీటర్ల సీసీ రోడ్డును కాటా శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.

**ప్రజా సేవలో శశిధర్ రెడ్డి ముందడుగు...**

ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో శశిధర్ రెడ్డి ముందుండటం అభినందనీయమన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కోసం సొంత నిధులను వెచ్చిస్తూ అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. ఒకవైపు రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తూ, మరోవైపు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం మంచి పరిణామం అన్నారు. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి దంపతులను కాట శ్రీనివాస్ గౌడ్ దంపతులు రంగా సన్మానించారు.

కాట శ్రీనివాస్ గౌడ్ సహకారం, ప్రజల ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపడతానని శశిధర్ రెడ్డి తెలిపారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ తనపై మరింత బాధ్యతను పెంచుతోందన్నారు.

**అభినందించిన కాలనీవాసులు...**

తమ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి సొంత నిధులు వెచ్చించడంతో పాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన శశిధర్ రెడ్డి, లావణ్య శశిధర్ రెడ్డి దంపతులకు నల్లూరి హైట్స్ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, ఆత్మ కమిటీ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, నల్లూరి హైట్స్ కాలనీ వాసులు, వివిధ కాలనీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సాంప్రదాయాలకు
## నిదర్శనం బోనాల ఉత్సవాలు

**మునిపల్లి, ఆగస్టు 8(జనంసాక్షి):** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకుల నిదర్శనంగా ఆషాడమాసం లో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మునిపల్లి మండలంలోని తాటిపల్లి యునైటెడ్, బుదేరా ఎస్‌వీఆర్ పాఠ శాలలో విద్యార్థులు బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో విద్యా ర్థులు మన తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాలు తయారు చేసారు. మరి కొందరు విద్యార్థులు పోతురాజు వేశాధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండంట్ తాటిపల్లి మల్లేశం, ప్రధానోపాధ్యాయులు అరుంధతి, విజయ్ కుమార్ మరియు షౌకత్ అలీ వారి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ప్రజా అవసరాలను తీర్చడం అభినందనీయం

- సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో కాట దంపతులు



**అమీన్పూర్, ఆగస్టు 8(జనంసాక్షి):** ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడం అభినందనీయమని పటాన్చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా పేర్కొన్నారు. శనివారం బీరంగూడ డివిజన్ పరిధిలోని ఎస్.ఎల్.ఎన్. హోమ్స్ నుంచి నల్లూరి హైట్స్ అపార్ట్మెంట్స్ వరకు మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యురాలు లావణ్య కాలనీవాసులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



**గండీడ్,ఆగస్టు 08(జనంసాక్షి):** గండీడ్ మండల కేంద్రంలో పండుగ సాయన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన కోసం శనివారం నాడు సర్పంచ్ భగవంత రెడ్డి, భూమి పూజ చేశారు. కార్యక్ర మంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బోయిని గోపాల్, ప్రధాన కార్యదర్శి ర్యాకం కేశవులు,ఉపాధ్యక్షుడు కొత్త గోపాల్, కార్య దర్శులు అంజిలయ్య, వెంకటయ్య, సాయిలు, లక్ష్మయ్య, శ్రీనివాసులు, భీమయ్య, లక్ష్మీనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాదిగ బోనాల పండుగ మహోత్సవం వేడుకలు

- బోనాల వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- ఎమ్మెల్యే చింత ప్రభాకర్, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి







**సంగారెడ్డి, ఆగస్టు 08 (జనంసాక్షి):** ఆషాఢ మాసం పురస్కరించుకొని మాదిగ బోనాల మహోత్సవ వేడు కలు అంగరంగ వైభవంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలు సంగారెడ్డి పట్టణంలోని ఐబి నుండి అస్రా బల్ , ఎల్లమ్మ తల్లి దేవాలయం వరకు బోనాల ఊరేగింపు, కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, డిసిసి అధ్యక్షు రాలు నిర్మల జగ్గారెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ వనిత సంతోష్ కుమార్, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడం మాసం పుస్కరించుకొని ప్రజ లు అష్ట ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో చల్లంగా జీవించాలని ఆ అమ్మవారి అమ్మవారి ఆశీర్వాదం ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ కులబాంధవులు పాల్గొన్నారు

## కోటకొండలో పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన కోసం భూమి పూజ

- అందరివాడు పండుగ సాయన్న...వక్తలు



**నారాయణపేట ఆగస్టు 8(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా మండలం కోటకొండ గ్రామంలో మత్స్యకార సంఘం గ్రామ అధ్యక్షులు ఎదురింటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద చెరువు దగ్గర బహుజన నాయకుడు పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటు కోసం శనివారం భూమి పూజనిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులు మాట్లాడుతూ పండుగ సాయన్న భారత స్వతంత్రోద్యమ (1900) కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలు ఒక సమాంతర చరిత్ర. పండుగ సాయన్న ఈ సమాంతర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగినవాడన్నారు. పండుగ సాయన్న 1860 నుండి 1900 వరకు జీవించి. 35- 38 ఏళ్ల వయసులో చంప బడినాడని, దానధర్మాలు చేసిన ప్రజా నాయకుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజలను దోసుకుంటున్న దొరల, దేశ ముక్‌ల, అధికారుల, సంపన్నుల ఆస్తులను తీసుకొని, ఇవ్వకపోతే దోచుకుని పేదలకు పంచి పెట్టి ప్రజల మనిషిగా ఎదిగాడన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షులు ఎదురెంటి శ్రీని వాసులు, గ్రామ సర్పంచ్ వెంకట్రామ్ గౌడ్,ఉప సర్పంచ్ చెన్నప్ప యాదవ్,బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వేపురి రాములు, బీజేపీ మాజీ ఎంపీటీసీ కెంచె శ్రీనివాసులు, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, యువకులు ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ: ఎంపీడీఓ విజయ్‌కుమార్



**జడ్చర్ల, శనివారం 08(జనంసాక్షి):** చేయూత పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభ మైనట్లు ఎంపీడీఓ విజయ్ కుమార్ తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, గీత, చేనేత కార్మికులు, ఫైలేరి యా (బోదకాలు) బాధితులు, డయాలసిస్ బాధితులు, దివ్యాంగులు, థలసీమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితుల కేటగిరీలకు చెందిన వారు ఈ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షల కంటే తక్కువ ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారు, మూడెకరాల కంటే ఎక్కువ మాగాణి లేదా 7.5 ఎకరాల కంటే ఎక్కువ మెట్ట పొలం ఉన్నవారు అనర్హులు. అలాగే ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, ప్రైవేటు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, డాక్టర్లు, కాంట్రాక్టర్లు, వృత్తి నిపుణులు, ఆయిల్ మిల్లులు, రైస్ మిల్లులు, పెట్రోల్ పంపులు, రిగ్ యజమానులు, వారి తల్లిదండ్రులు అనర్హులుగా పరిగణించబడతారు. ఇప్పటికే ప్రభుత్వం లేదా స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పొందుతున్నవారు, నాలుగు చక్రాల వాహనాలు లేదా భారీ వాహనాలు ఉన్నవారు కూడా దీనికి అనర్హులు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సమర్పించాలని సూచించారు.

## వీధిలైట్ల ఏర్పాటుతో గ్రామానికి కొత్త వెలుగులు



**మనోపాడు, ఆగస్టు 8 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా, మనోపాడు మండలం అమరవాయి గ్రామంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా వీధిలైట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని బురుజు ప్రాంతంతో పాటు అన్ని వార్డుల్లో పాడైపోయిన వీధిలైట్లను గుర్తించి, వాటి స్థానంలో కొత్త లైట్లను అమర్చారు. గ్రామంలో రాత్రివేళ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వీధుల్లో వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టా రు. గ్రామంలోని అన్ని వార్డుల్లో లైట్ల పరిస్థితిని పరిశీ లించి, పనిచేయని లైట్లను తొలగించి కొత్త లైట్లు ఏర్పా టు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమరవాయి గ్రామ సర్పంచ్ పి.హుస్సేన్, కార్తీక్, కరెంట్ టెక్నీషియన్ వీరన్న, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు. గ్రామంలో ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. వీధిలైట్ల ఏర్పాటుతో రాత్రివేళ రాకపోకలు సాగించే ప్రజలకు, స్థానికులకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు: ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య



**నారాయణపేట, ఆగస్టు 8(జనంసాక్షి):** నెంబర్ ప్లేట్ లేకుండా వాహ నాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య తెలిపారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహ నాల తనిఖీలు నిర్వహించి నెంబర్ ప్లేట్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వాహన దారులను గుర్తించి జరిమానాలు విధించారు. అలాగే వెంటనే నెంబర్ పెట్టు వేసుకోవాలని అవగా హన కల్పించారు.ఈ సంద ర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహ నానికి నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నెంబ ర్ ప్లేట్ లేకుండా వాహనా లు నడపడం వల్ల వాహ నాన్ని గుర్తించడం కష్టమ వడంతో పాటు, నేరాలు జరిగిన సందర్భాల్లో దర్యాప్తుకు కూడా ఇబ్బం దులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వాహనదారులు తమ వాహ నాలకు ప్రామా ణికమైన నెంబర్ ప్లేట్లను తప్పనిసరిగా అమర్చుకో వాలని సూచించారు. నెంబర్ ప్లేట్‌ను వక్రీకరిం చడం, అక్షరాలు లేదా అం కెలను స్పష్టంగా కనిపించ కుండా చేయడం, నెంబర్ ప్లేట్ స్థానంలో ఇతర రకాల ప్లేట్లు ఉపయోగించడం వంటి నిబంధనల ఉల్లంఘ నలను సహించబోమని స్పష్టం చేశారు.ట్రాఫిక్ నిబం ధనలు ప్రజల భద్రత కోస మేరూపొందించబడ్డాయని అన్నారు. ప్రతి వాహన దారుడు బాధ్యతగా వ్యవ హరించి నిబంధనలను పాటించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహ నానికి సంబంధించిన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు చెల్లు బాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లం ఘించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగించే అవకాశం ఉందని ఎస్ఐ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ప్రజలందరూ బాధ్యతా యుతమైన వాహ నదారులుగా వ్యవహరించాలని ఆయన కోరారు.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



**మల్దకల్,ఆగస్టు 8(జనంసాక్షి):** మండల పరిధిలోని తాటికుంట గ్రామంలో శనివారం రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచా యతీ భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. గ్రామపంచాయతీ భవన నిర్మా ణానికి స్థలాన్ని ఇచ్చిన దాత ఈశ్వరయ్య నాగలక్ష్మమ్మ జ్ఞాపకార్థం అందజేయగా అట్టి స్థలంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలతో గ్రామ సర్పంచ్ సరోజా ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో పటేల్ ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ సత్య రెడ్డి,మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి,మాజీ సింగల్ విండో డైరెక్టర్ భాను ప్రకాష్ రెడ్డి,రాజు,మాజీ సర్పంచ్ అంజి,వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వ నిధులతో నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు.

# బాలానగర్ ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్!

- **నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశం**
- **అంబేద్కర్ విగ్రహ పనుల పురోగతిని సమీక్షించిన మధుసూదన్ నాయక్**



**బాలానగర్, ఆగస్టు 08 (జనంసాక్షి):** మహబూబ్ నగర్ జిల్లా, బాలానగర్‌లో NHAI ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులు, అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారుల నుంచి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత నాణ్యతా ప్రమాణాలకు ఎలాంటి రాజీ లేకుండా పనులు జరగాలని స్పష్టం చేశారు. ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని NHAI అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశారు.
పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని, ప్రభుత్వం ఆమోదించిన ప్రమాణాలను పాటించాలని, భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని, నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పనులను వేగవంతం చేయాలని ఆయన అన్నారు. ఈ తనిఖీలో NHAI అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వడ్డేమాన్‌లో శ్రీశనేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో తిలతైల అభిషేక పూజలు

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 8 (జనంసాక్షి):** శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాడ మాసం క్రిష్ణ పక్షంనాడు దశమి శనివారం రోహిణి నక్షత్రము నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకలు భక్తితో వేదమంత్రచరణల మధ్య వైభవంగా జరిగాయి. శ్రీసార్ధాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ, ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చన, పూజలు భక్తులచే నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్



వెల్దండ గోపాల్‌రావు, గ్రామసర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షుడిగా కొండోజు అశోక్‌చారి

**కల్వకుర్తి, ఆగస్టు 8(జనంసాక్షి):** హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగానాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొండోజు అశోక్‌చారి నియమితులయ్యారు. సంస్థ జాతీయ చైర్మన్ నందన్ నరసింహరావు ఆదేశాల మేరకు ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. అశోక్‌చారి నియామకంపై తుర్కలపల్లి గ్రామస్థులతో పాటు పలువురు సామాజిక, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు గురవుతున్న బాధితులకు అండగా నిలిచి న్యాయం జరిగేలా కృషి చేయడంతో పాటు, ప్రజలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. మహిళలు, బాలలు, పేదలు, అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అశోక్‌చారి నాయకత్వంలో సంస్థను తెలంగాణవ్యాప్తంగా మరింత బలోపేతం చేసి, ప్రతి జిల్లాలో కార్యకలాపాలను విస్తరించాలని ఆకాంక్షించారు. బాధితులకు న్యాయం అందించడం, ప్రజాస్వామ్య విలువలు, మానవ





హక్కులు, సామాజిక సమానత్వం కోసం నిరంతరం పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా అశోక్‌చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ చైర్మన్ నందన్ నరసింహరావుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారం, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థను విస్తరించి ప్రజలకు మరింత చేరువగాసేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# బైకును ఢీకొన్న బులోరా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

**మాగనూర్ (జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరసింహ రెడ్డి(60) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నరసింహారెడ్డి బైక్ పై తాసిల్దార్ కార్యాలయం వైపు నుంచి వస్తుండగా వెనుక నుంచి బొలెరో బైకును బలంగా ఢీకొన్నది ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంబడే బొలెరో ను అక్కడ వదిలేసి డ్రైవర్ పారిపోయాడు. మృతిదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొలెరోన స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.మక్తల్ నియోజకవర్గం మాగనూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహారెడ్డి నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరం. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డా వాకిటి శ్రీహరి మాగనూరుకు చేరుకొని నరసింహారెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి



కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. అదేవిధంగా వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు కార్యకర్తలు & గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఇఐఆర్ పోర్టల్ ద్వారా రెండు మొబైల్ ఫోన్‌లు రికవరీ



**రాజాపూర్, ఆగస్టు 8(జనంసాక్షీ):** బాలానగర్ మండలానికి చెందిన సయ్యద్ నభీ, చెన్నయ్య తమ సెల్ ఫోన్లు దొంగిలించబడగా, రాజాపూర్ పోలీసులు సీఇఐఆర్ పోర్టల్ ద్వారా దొంగిలించబడిన రెండు మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడం జరిగింది.ఇందుకు కృషిచేసిన కానిస్టేబుల్ కిరణ్ ను ఎస్సై రాజాశేఖర్ అభినందించడం జరిగింది.

# భార్యతో గొడవ.. కనిపించకుండా పోయిన భర్త



**బాలానగర్ /ఆగస్టు 08(జనంసాక్షి):** బాలానగర్ మండలం ఉడిత్యాలకు చెందిన ఓ వ్యక్తి కనిపించకుండా పోవడంతో బాలానగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉడిత్యాలకు చెందిన రుక్నొద్దీన్‌కు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం తొండుపల్లికి చెందిన జరీనా బేగంతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. గత కొంతకాలంగా కుటుంబ విషయాలపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జూలై 31న ఉదయం రుక్నొద్దీన్ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రుక్నోదిన్ తల్లి జరీనా ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు.

# కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థుల సత్తా..

- **14 మందికి బెల్ట్‌లు, సర్టిఫికెట్లు**



**గోపాల్పేట, ఆగస్టు 8 (జనంసాక్షి):** గోపాల్పేట జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ మైదానంలో విక్టరీ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శనివారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు ఘనంగా నిర్వహించారు. మాస్టర్ రాగిరి సురేందర్ పర్యవేక్షణలో మొత్తం 25 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 14 మంది విజయవంతంగా గ్రేడింగ్ సాధించి బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందుకున్నారు. బుద్ధారం గ్రామానికి చెందిన మహేందర్ ఎల్లో బెల్ట్, జోషిక్ రామ్ పర్పుల్ బెల్ట్, జయభారతి మారూన్ బెల్ట్, భవిష్, ఉమేష్ బ్రౌన్ బెల్ట్‌లు సాధించారు. గోపాల్పేటకు చెందిన అక్షయ, దివిజ, గీతారాణి, సాయి ఆర్యన్, జమీర్, యువకిరణ్ ఆరంజ్ బెల్ట్‌లు పొందగా, సూర్యనారాయణ, చైతన్య, హరిహరన్ గ్రీన్ బెల్ట్‌లు సాధించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన పరీక్షల్లో విద్యార్థులు కటాస్, కిక్స్, బ్లాక్స్, కరాటే ఫైట్, కర్రసాము, నంచాకు, జంప్ స్టిక్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచి గ్రేడింగ్ సాధించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు పవన్ యాదవ్, జస్వంత్, హర్షిత్, విఘ్నేష్, వెన్నెల, జయకృష్ణ పరీక్షల నిర్వహణలో పాల్గొన్నారు. ముఖ్య అతిథి శ్రావణ్ చేతుల మీదుగా మాస్టర్ సురేందర్ విజేతలకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు జయరామ్, నిఖిల్ యాదవ్, దయ్యం రాజు, శ్యామ్, చంద్రశేఖర్, శివ, పవన్ యాదవ్, జస్వంత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని గ్రేడింగ్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ విషయాన్ని మాస్టర్ రాగిరి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మిషన్ భగీరథ

# మాజీ వైస్ చైర్మన్‌తో వెల్దండ బీఆర్ఎస్ నాయకుల భేటీ



**వెల్దండ, ఆగస్టు 08 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ ను శనివారం హైదరాబాద్ లోని తన నివాసంలో తెలంగాణ ఉద్యమకారులు, వెల్దండ మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు కానుగుల జోగయ్య కన్యాకుమారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఉప్పలను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన గ్రామంలోని అసంపూర్తి గృహ నిర్మాణాలకు, పేద విద్యార్థులకు, బాధిత కుటుంబాలకు తన సహాయ సహకారాలు ఎల్ల ప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చలి చీమల జ్యోతి నిరంజన్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము నాగయ్య, యువ నాయకులు బాదేపల్లి గోపాల్, బాదేపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా ఉడందాపూర్ జలాశయం

- ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, ఆగస్టు 8 (జనంసాక్షి):** ఉడందాపూర్ రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 26న తెలంగాణ శాసన సభలో జీరో అవర్ సందర్భంగా తాను చేసిన ప్రస్తావనకు ప్రభుత్వ యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారికంగా స్పందించిందని ఆయన వెల్లడించారు. సోమశిల, అలంపూర్ స్పెషల్ టూరిజం ఏరియాలో భాగంగా ఉడందాపూర్ రిజర్వాయర్‌ను ప్రభుత్వం చేర్చిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి అవసరమైన సమగ్ర మాస్టర్ ప్లాన్‌ల రూపకల్పన ప్రస్తుతం కొనసాగుతోందని, ఈ ప్రతిపాదనకు సంబంధిత మంత్రుల ఆమోదం లభించిందని వివరించారు. నూతన టూరిజం పాలసీకి అనుగుణంగా ఇక్కడ జల, ప్రకృతి, సాహస పర్యాటకాన్ని అభివృద్ధి చేయడం వల్ల జడ్చర్ల నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు, స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు.

## శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం.. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు

- అరబిందో ఫార్మా కంపెనీ సహకారంతో 1.5 కోట్లతో నూతన భవన నిర్మాణం
- మండల విద్యాధికారి అబ్దుల్ రహీం




శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం

**ఉర్కొండ, ఆగస్టు 08, (జనంసాక్షి);** శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక పాఠశాల భవనము విద్యార్థుల ప్రాణాలకు ముప్పు అనే శీర్షికన జనం సాక్షి పత్రికలో వెలువడిన కథనానికి మండల విద్యాధికారి అబ్దుల్ రహీం, సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్ స్పందించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా, ఉర్కొండ మండలం, జకినాలపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారనీ, కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనం పైకప్పు నుండి ప్లాస్టర్ ఊడిపడుతోంది. గోడల్లో పగుళ్లు ఏర్పడి, వర్షం పడితే నీరు లోపలికి కారుతోంది. ప్రస్తుతం సుమారు 50 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. వర్షాకాలంలో భవనం కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారనీ. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఉపాధ్యాయులు వాపోయరు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖాధికారులను, స్థానిక ప్రజాప్రతినిధులను గతంలో కోరిన ఫలితం లేకపోయింది. దీంతో ఈ విషయాన్ని జనం సాక్షి విలేఖరి దృష్టికి తీసుకెళ్లగా కథనాన్ని పత్రికలో ప్రచురించడం జరిగింది.

**అరబిందో ఫార్మా కంపెనీ సహకారంతో నూతన భవన నిర్మాణం: మండల విద్యాధికారి: అబ్దుల్ రహీం**

పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అరబిందో ఫార్మా కంపెనీ వారు స్కూలు భవన నిర్మాణానికి కోటి 50 లక్షల రూపాయలతో అన్ని సౌకర్యాలతో నూతన భవన నిర్మాణం చేయడానికి ముందుకు రావడం జరిగింది. జకినాలపల్లి పాఠశాలకు ప్రీ ప్రైమరీ స్కూల్ కూడా మంజూరు కావడం జరిగిందని తెలియజేశారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**నవాబుపేట, ఆగస్ట్ 8(జనంసాక్షి):** మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో తెలంగాణ వీరుడు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ పోరాట యోధుడు పండుగ సాయన్న జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని కూడళ్లలో పండుగ సాయన్న చిత్రపటాలకు, విగ్రహాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, యువకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రుద్రారంలో సర్పంచ్ రవి రుద్రారం ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నిర్భయంగా పోరాడిన పండుగ సాయన్న త్యాగస్ఫూర్తి, ధైర్యసాహసాలు తెలంగాణ సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల స్వాభిమానం కోసం ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన చేసిన సేవలు తెలంగాణ చరిత్రలో మరువలేనివని గుర్తుచేసుకున్నారు. మండలంలోని అన్ని పల్లెల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని సాయన్న స్మరణతో జై సాయన్న అంటూ నినాదాలు చేశారు.



## ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

- పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్
- 300 మంది అభ్యర్థులకు వట్టెంలోని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ క్యాంపస్‌లో శిక్షణ



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 8 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై), కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు రామ్ రెడ్డి తెలిపారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పి. మధుకర్ స్వామి (డీసీపీ) సారథ్యంలో రాంకీ ఫౌండేషన్, లైన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్‌ల్యాండ్స్ ఆఫ్ హైదరాబాద్‌ల సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు అర్హులైన అభ్యర్థులు 2026 ఆగస్టు 6వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఫేస్‌బుక్ పేజీ, యూట్యూబ్ ఛానల్, టెలిగ్రామ్ గ్రూప్ లేదా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 2026 ఆగస్టు 12వ తేదీ రాత్రి 9 గంటలు అని పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో భాగంగా 2026 ఆగస్టు 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 పరీక్షా కేంద్రాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభ్యర్థులకు వనపర్తి పరీక్షా కేంద్రంగా ఉంటుందని వెల్లడించారు. అర్హత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికైన 300 మంది అభ్యర్థులకు నాగర్‌కర్నూల్ జిల్లా వట్టెంలోని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ క్యాంపస్‌లో పూర్తిగా ఉచితంగా రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే పోలీసు నియామక ప్రక్రియలోని మెయిన్ పరీక్ష వరకు ఈ శిక్షణ నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని,మరిన్ని వివరాలకు 9542433427 ను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి: పులగుర్ల కృష్ణారెడ్డి సర్పంచ్ కుర్మిద్ద

- 15లోగా అర్హులు దరఖాస్తు చేయాలి



**కల్వకుర్తి,ఆగస్టు08,(జనంసాక్షి):** కొత్త పింఛన్ల కోసం అర్హులైన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కుర్మిద్ద సర్పంచ్ పులగుర్ల కృష్ణారెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 15వ తేదీ వరకు కొత్త పింఛన్ల దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అనంతరం అర్హతలను పరిశీలించి పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వితంతువులు,దివ్యాంగులు తదితర అర్హులైన వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పింఛన్ అందేలా అవసరమైన సహకారం అందిస్తామని సర్పంచ్ పులగుర్ల కృష్ణారెడ్డి తెలిపారు.

## చింతలముని దేవాలయ ఆవరణలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే



**మల్దకల్, ఆగస్టు 8(జనంసాక్షి):** మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సప్తహ భజన కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం చింతలముని దేవాలయం ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే దేవాలయంలో ఆలయ అర్చకులు, మధుసూదనాచారి,రవి ఆచారి,రమేష్ ఆచారి,ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గడ్డం కృష్ణారెడ్డి పటేల్ ప్రభాకర్ రెడ్డి, సత్యారెడ్డి,ప్రభాకర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి,విక్రం రెడ్డి,విజయ్ కుమార్,జంబు రామన్ గౌడు,ఈవో పురేందర్,పూజార్లు, భజన భక్తాదులుతదితరులు పాల్గొన్నారు.

## జూరాల చివరి ఆయకట్టు వరకు వానకాలం వరి సాగుకు సాగు నీరు అందించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డీ

**అమరచింత, ఆగస్ట్ 8(జనంసాక్షి):** తెలంగాణ రైతు సంఘం ఏ.ఐ.కె.ఎస్. వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూరాల ప్రాజెక్టు లెఫ్ట్ కెనాల్ ను రైతు సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికల్లో రైతులతో మాట్లాడుతూ జూరాల లెఫ్ట్ కెనాల్ ద్వారా వానకాలం వరి సాగు కోసం నీరు వదలడం సాధ్యం కాదని చెప్పడం ద్వారా, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే లెఫ్ట్ కెనాల్ కింద వరినాట్లు ముమ్మరంగా రైతులు వేయడం జరుగుతుంది. కాలువ ద్వారా మరి కొంతమంది రైతులు తుకాలు పోయడం జరుగుతుంది. ఈష్ట్ర సమయంలో ఇలాంటి మాటలు అధికారులు మాట్లాడడం ద్వారా రైతులు ఆందోళనకు గురవుతున్నరని ఆందోళన వ్యక్తం చెశారు. కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాములు ఇప్పటికే నిండి అలుగులు పారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలా చెప్పడం సరైన పద్ధతి కాదని, ఒకవేళ వరి సాగుకు నిళ్లు సరిపోకపోయి నపక్కన నున్న కర్ణాటక లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది కాబట్టి వారితో మాట్లాడి వానకాలం వరిసాగుకు చివరి ఆయకట్టు వరకు నీరు అందించే విధంగా తెలంగాణ లోని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జూరాల డ్యామ్ లో 9



టీఎంసీల సామర్థ్యం ఉన్నప్పటికీ ఒంద్రు మట్టి రాళ్లు పేరుకు పోవడం ద్వారా ఎక్కువ నీళ్లు నిల్వ చేసుకోకపోవడం వల్ల నష్టం జరుగుతుందని, భవిష్యత్తులో ఈవంద్రు పూడికగతీత పనులు చేపట్టాలని జూరాల ఎత్తును పెంచి 15 టీఎంసీల నీళ్లు నిల్వ ఉండే విధంగా కొత్తగా డిజైన్ చేయాలని, కర్ణాటకలో ముంపు కు గురవుతున్న ప్రాంతాలకు నష్టపరిహారం చెల్లించి, శాశ్వత పరిష్కారం ఉండే విధంగా ప్రయత్నం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భనలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎస్ గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శు లు ఆర్ఎన్ రమేష్, మండ్ల రాజు, సిఐటియు నాయకులు ఎస్ రాజు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు సిబ్బందికి 45 రోజుల కరాటే శిక్షణ ప్రారంభం

• స్వీయ రక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే శిక్షణ ఎంతో ఉపయోగకరం: జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ రూరల్, ఆగస్టు 08(జనంసాక్షి):** పోలీసు సిబ్బంది ఉద్యోగపరంగా ఎదురయ్యే వివిధ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, స్వీయ రక్షణలో సమర్థులుగా తీర్చిదిద్దడంతో పాటు వారి శారీరక, మానసిక సామర్థ్యాలను మరింత పెంపొందించాలనే ఉద్దేశంతో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి 45 రోజుల కరాటే శిక్షణా కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కవాతు మైదానంలో జిల్లా ఎస్పీ జానకి, ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో వివిధ రకాల పరిస్థితులు, సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్వీయ రక్షణ నైపుణ్యాలను కలిగి ఉండటం పోలీసు సిబ్బందికి ఎంతో అవసరమని, ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ఇతరులను రక్షించేందుకు కూడా ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కరాటే శిక్షణ కేవలం స్వీయ రక్షణకే పరిమితం కాదని, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం,



ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు త్వరిత నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని ఎస్పీ తెలిపారు. పోలీసు విధుల్లో భాగంగా వివిధ పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో ఈ నైపుణ్యాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, శిక్షణ లో చురుకుగా పాల్గొని కరాటేలోని మెళకువలను పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని ఎస్పీ సూచించారు. క్రమశిక్షణతో శిక్షణ పొందడం ద్వారా శారీరక సామర్థ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరిగి, విధి నిర్వహణ లో మరింత సమర్థవంతంగా పనిచేయగలుగుతారని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది తమ కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ప్రజల భద్రత కోసం విధుల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి శారీరక



మరియు మానసిక సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహద పడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ 45 రోజుల కరాటే శిక్షణా కార్యక్రమంలో పోలీసు సిబ్బందికి స్వీయ రక్షణ పద్ధతులు, శారీరక దృఢత్వానికి సంబంధించిన వ్యాయామాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే శిక్షణతో పాటు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే వివిధ కరాటే మెళకువలను నేర్పించనున్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే విధంగా సిబ్బందిని శారీరకంగా, మానసికంగా సిద్ధం చేయడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో AR అదనపు ఎస్పీ సురేష్ కుమార్, DSP రమణా రెడ్డి, RIలు కృష్ణయ్య, నగేష్, RSIలు రమేష్, సత్యం, వన్‌టౌన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వసంతతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా యాదయ్య



**రాజాపూర్, ఆగస్టు 8 (జనంసాక్షి):** జిల్లా ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ఆధ్వర్యంలో రాజాపూర్ మండల కేంద్రంలో శనివారం మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా, రంగారెడ్డిగూడ ఉపసర్పంచ్ ఉప్పరి యాదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి గా తిరుమాలాపూర్ గ్రామ ఉప సర్పంచ్ రామచంద్రయ్య ను ఎన్నుకున్నారు. వివిధ గ్రామాల ఉపసర్పంచ్‌లను కమిటీ సభ్యులుగా నియమించారు.

## యువ సమ్మేళనం... కరపత్రాల పంపిణీ



**నారాయణపేట, ఆగస్టు 08(జనంసాక్షి):** నారాయణపేట నగరం ఆర్ ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 12 ఆగస్టు 2026 రోజు బుధవారం సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు యువ సమ్మేళనం కార్యక్రమం జిల్లా కేంద్రంలోని శిలా గార్డెన్స్ దగ్గర నిర్వహించబడుతుంది.
ఈ సందర్భంగా ఈరోజు శనివారం పట్టణంలోని గాంధీనగర్ లో యువకులకు కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు...
యువకులు ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ నగర సంఘ సంఘచాలక్ డాక్టర్ డి.మదన్ మోహన్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా అప్పల ప్రసాద్ గారు ప్రాంత వేదిక కన్వీనర్ హాజరై ప్రసంగిస్తారని చెప్పారు.
పట్టణంలోని యువ సమ్మేళనం కార్యక్రమానికి అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘ నాయకులు మేడం ప్రభాకర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న 'జైల్ బరో' కార్యక్రమం

• మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా CITU పిలుపు


**ఆత్మకూర్, ఆగస్టు 8(జనంసాక్షి):** నరేంద్ర మోదీ బీజేపీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న 'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో 'జైల్ బరో' కార్యక్రమం నిర్వహిస్తామని CITU నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలంతా జిల్లా కేంద్రాలలో ధర్నాలు, నిరసనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో CITU జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మండ్ల రాజు, ఆర్.ఎన్. రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. రాజు, బుచ్చన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి. భల్ రెడ్డి, ఉపాధ్యక్షులు జి.ఎస్. గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్ భారతీయుడు, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, వ్యవసాయ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## కలుపు మొక్కల నివారణకు సర్పంచ్ చొరవ

**తెలకపల్లి, ఆగస్టు 8 (జనంసాక్షి):** మండల పరిధిలోని ఆలేరు గ్రామంలో కలుపు మొక్కలు అధికంగా పెరగడంతో వాటి నివారణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ ఆనంద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ద్వారా కలుపు మందు పిచికారీ చేసి ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో కలుపు మొక్కల సమస్యను నివారించాలని ప్రజలు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారు. గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు పంచాయతీ ఆధ్వర్యంలో కలుపు మందు పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సర్పంచ్ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం



**తెలకపల్లి, ఆగస్టు 8 (జనంసాక్షి):** పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన ధీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ పండుగ సాయన్న తెలంగాణ ప్రాంతంలో అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలిచిన ప్రజా పోరాట యోధుడని పేర్కొన్నారు. నిజాం పాలన కాలంలో పేద ప్రజలపై జరుగుతున్న దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా సాయుధంగా పోరాడి, సంపన్నుల వద్ద ఉన్న సంపదను పేదలకు పంచిన ధీరుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. పేదల పక్షాన నిలిచి సామాజిక న్యాయం కోసం పోరాడిన ఆయన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన సేవలను స్మరించుకోవడం ద్వారా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బతికె మల్లేష్, భాషమోని మల్లేష్, భాషమోని ఈశ్వర్, రెడ్డపాకుల శివకుమార్, దర్శనం సురేష్, ఎత్తపు సాయి, గణేశ్, వంశీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళ వాయిద్య కళాకారుల సంక్షేమమే లక్ష్యం

• తెలంగాణ మంగళ వాయిద్య కళాకారుల సంఘం • జిల్లా అధ్యక్షుడిగా సదుర్ల తిరుపతయ్య ఏకగ్రీవ ఎన్నిక

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 8 (జనంసాక్షి):** తెలంగాణ మంగళ వాయిద్య కళాకారుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్‌లోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్నాయిపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. చంద్రశేఖర్, టి. రామకృష్ణ, టి. సురేష్‌కుమార్, జె. మహేష్‌ల అధ్యక్షతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది.జిల్లా అధ్యక్షుడిగా సదుర్ల తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా సదుర్ల నాగరాజు, కోశాధికారిగా జి. రాజు, జాయింట్ కోశాధికారిగా సదుర్ల అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**నూతన జిల్లా కమిటీ:**

**గౌరవ అధ్యక్షులు:** సదుర్ల సాంబశివుడు, సదుర్ల గోపాల్, సింగోటం నారాయణ, సింగోటం వెంకటస్వామి, కుడికిల్ల తిరుపతయ్య.

**ఉపాధ్యక్షులు:** ఎం. చంద్రశేఖర్ (ఎల్లూర్), టి. రామకృష్ణ (జటప్రోలు), టి. సత్యనారాయణ (కుడికిల్ల), టి. సురేష్‌కుమార్ (పెంట్లవెల్లి), జె. మహేష్ (జటప్రోలు).

**జాయింట్ సెక్రటరీలు:** టి. శ్రీనివాసులు, ఎ. సురేందర్, రామనరసింహ, విష్ణుకుమార్, టి. రమేష్.

**ప్రచార కార్యదర్శులు:** వెంకటేష్ (వడ్డేమాన్), సదుర్ల కార్తీక్ (కుడికిల్ల).

**కార్యవర్గ సభ్యులు:** పాలెం శ్రీనివాసులు, వెంకటస్వామి, పెంట్లవెల్లి కుమారస్వామి, శివప్రసాద్, శాయిన్‌పల్లి శ్రీకాంత్, నరేష్ (ఎల్లూర్), సతీష్ (జటప్రోలు), హరీష్ (పెంట్లవెల్లి), బాలకృష్ణ (సింగోటం).

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్నాయిపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ నూతన జిల్లా కమిటీ ఐదేళ్ల కాలపరిమితితో కొనసాగుతుందని తెలిపారు. మంగళ వాయిద్య కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. కళాకారుల హక్కులు, ఉపాధి



అవకాశాలు, సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.
జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సదుర్ల తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సదుర్ల నాగరాజు మాట్లాడుతూ మంగళ వాయిద్య కళాకారుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని, వృద్ధ కళాకారులకు నెలకు రూ.10 వేల పింఛన్ అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. అదేవిధంగా అర్హులైన కళాకారులకు ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు.మంగళ వాయిద్య కళను పరిరక్షించడంతో పాటు కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నూతన కమిటీ ఐక్యంగా పనిచేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు కళాకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తామని సభ్యుల సమక్షంలో ప్రమాణం చేశారు.

## ప్రధాన రహదారి - ప్రయాణం గోదారి



**కోహెడ, ఆగస్టు 09(జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల నుండి ప్రాథమికొన్నత పాఠశాలకు వెళ్లే రహదారిపై వర్షపు నీరు నిలిచి విద్యార్థులకు, బాటసారులకు ప్రయాణం చాలా ఇబ్బందిగా మారింది. ప్రధాన రహదారి – ప్రయాణం గోదారి అన్నట్లు తయారయ్యింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పట్టించుకొని బాటసారుల ఇబ్బందులు తీర్చాలని పలువురు కోరుతున్నారు.గత కొన్నేళ్లుగా ఈ సమస్య ఇలా ఉన్నా కానీ ఏ పాలకులు, అధికారులు పట్టించుకువడం లేదని పలువురు ప్రయాణికులు, కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ సమస్యను తీర్చి ప్రయాణీకుల, కాలనీవాసుల ఇబ్బందులు తీర్చి శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## మాజీ మంత్రిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదు

ఎవరి స్థాయి ఏంటో రాష్ట్ర ప్రజలకు, వనపర్తి నియోజకవర్గ ప్రజలకు తెలుసని, తెలంగాణ ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎవరికి కూడా సరైన అవగాహన లేదని, నిరంజన్ రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఏ ఒక్క నాయకులకు లేదని విమర్శించారు. అవగాహనే ఉంటే రైతులకు సరైన సమయానికి సాగునీరు అందించేవారు అని అవగాహన రాహిత్యం తోనే రైతులకు సాగునీరు అందించలేదని విమర్శించారు. ఇప్పటికైనా సాగు నుండి సరైన విధంగా అందించకపోతే రైతులలో చైతన్యం చేసి రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శివరామిరెడ్డి, గౌరీదేవి పల్లి సర్పంచ్ సురేందర్ రెడ్డి, రేవల్లి ఉప సర్పంచ్ సుధాకర్ రెడ్డి, నాగపూర్ మాజీ ఎంపిటిసి శ్రీశైలం, సింగల్ విండో మాజీ చైర్మన్ ఉత్తమ్ రెడ్డి, మిద్దె రాములు, నరసింహ శ్రీనివాస్ రెడ్డి, అల్తాఫ్ ప్రతాపరెడ్డి, కాళ్ళ కురుమయ్య, కాళ్ళ నిరంజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యం




**వెల్దండ, ఆగస్టు 08 (జనంసాక్షి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి బాణావత్ శంకర్ నాయక్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభివృద్ధి చేస్తున్నారని, కల్వకుర్తి అభివృద్ధి కసిరెడ్డికే సాధ్యమని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు,200 యూనిట్ల ఉచిత కరెంటు,పెళ్లయిన ఆడపిల్లలకు లక్ష రూపాయల నగదు అందజేస్తున్నదని తెలిపారు.రెండవసారి కసిరెడ్డి నారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా చేసి మంత్రిగా చూడాలన్నది తన కళ అని తెలిపారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిక్షపతి నాయక్, లస్కర్ నాయక్ లు ఉన్నారు.

## అంగన్వాడి టీచర్ల నియామకాలకు కొనసాగుతున్న ప్రక్షాళన

- క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న పర్యవేక్షకులు
- 7 అంగన్వాడి టీచర్లకు గాను 206 దరఖాస్తులు



**న్యాల్‌కల్, ఆగస్టు 08(జనంసాక్షి):** మండలంలో గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్లు, ఆయాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జూన్ 7నుండి17వరకు దరఖాస్తులను స్వీకరించింది. స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఈ మేరకు జహీరాబాద్ ఇన్చార్జి సీడీపీఓ పర్యవేక్షణలో.. న్యాల్ కల్ మండలానికి చెందిన పర్యవేక్షకులు.. అభ్యర్థులు అందజేసిన దరఖాస్తులను అభ్యర్థుల స్వగ్రామానికి వెళ్లి నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలన, ప్రక్షాళన కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుంది. గత వారం రోజులుగా న్యాల్ కల్, హద్నూర్, గంగువార్ అంగన్వాడి క్లస్టర్ పర్యవేక్షకులు దరఖాస్తుల ప్రక్షాళన చేపడుతున్నారు.

## నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**జడ్చర్ల, ఆగస్టు 8 (జనంసాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న వర్షపు నీటి కాల్వ పనులు, జాతీయ రహదారి పనులు, కల్వర్టు పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వర్షపు నీటి కాల్వ పనులు, జాతీయ రహదారి పనులు, కల్వర్టు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యతను ఆయన పరిశీలించి సమీక్షించారు. సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు పనులను వేగవంతం చేసి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని సంబంధిత శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూడాలని, ముఖ్యంగా పనులు జరుగుతున్న సమయంలో సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేదా సమస్యలు కలగకుండా ఉండేందుకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి



**తూప్రాన్, ఆగస్టు 8(జనంసాక్షి):**
మెదక్ జిల్లా మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌ను మల్టీ జోన్-I ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, ఐపీఎస్ గారు ఈరోజు సందర్శించి పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లు మరియు స్టేషన్ నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఐజీపీ గారు మాట్లాడి, పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే విధంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.
అదేవిధంగా నూతన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక చర్యలు మరియు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించి, అవసరమైన సూచనలు మరియు ఆదేశాలను జారీ చేశారు.
ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు, ఐపీఎస్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్, డీఎస్పీ తూప్రాన్ నరేందర్ గౌడ్ మరియు సీఐ తూప్రాన్ వెంకటరాజగౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాయిని దూరం చేస్తే.... మా బతుకులు ఆగిపోతాయి!

గత రెండేళ్లుగా ప్రతి మండలంలో అటవీశాఖ అధికారులు రాళ్లు కొట్టే తమ సంప్రదాయ వృత్తిని అడ్డుకుంటున్నారని దుర్గా సాయిలు తెలిపారు. ఉపాధి కోల్పోవడంతో అనేక వడ్డెర కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. గత ప్రభుత్వాల సమయంలో కూడా తమ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం వడ్డెరలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్‌గా జరుపటి జైపాల్‌ను, తెలంగాణ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుకను నియమించడం పట్ల వడ్డెర సమాజం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

**అడవుల్లోని బండలపై రాయి కొట్టేందుకు అనుమతులు ఇవ్వాలి...**

తెలంగాణ ముఖ్యమంత్రి తమ వడ్డెరల సమస్యలను ప్రత్యేకంగా పరిగణించి జీవనోపాధి కోసం అడవుల్లో ఉన్న అనుమతించదగిన బండలపై రాయి కొట్టుకునేందుకు చట్టబద్ధమైన అనుమతులు కల్పించాలని దుర్గా సాయిలు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనలను పాటిస్తూ, అటవీశాఖ సంబంధిత అధికారుల పర్యవేక్షణలో వడ్డెరలకు ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు.
వడ్డెర కుటుంబాలకు భూమి, గృహాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సంప్రదాయ వృత్తిని కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశంలో నాయకులు కోరారు. వడ్డెరల బతుకులు రాయితో ముడిపడి ఉన్నాయని, ఆ రాయిని దూరం చేస్తే వారి జీవనాధారం కూడా దూరమవుతుందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు దుర్గ సాయిలు, కొల్చారం మండలం అధ్యక్షులు ఓర్స ఈశ్వర్, దారంగుల ఎల్లయ్య, ఎత్తరి పెంటయ్య, వల్లపు శ్రీనివాస్, సంపంగి రమేష్, జరుపటి రాజు, హనుమంతు, వెంకటేశం, యాదగిరి, నిఖిల్, రమేష్, ఎల్లేష్, కుమార్, నాగయ్య, శివరాములు, పోచయ్య, నాగరాజ్, వీరేశం వడ్డెర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల బోనాల సందడి.. ఉట్టిపడిన తెలంగాణ సంప్రదాయ వైభవం

- బోనమెత్తిన కవలలు చిన్నారులు..
- తెలంగాణ సంప్రదాయానికి ప్రతిబింబంగా నిలిచిన వేడుక...
- భక్తిశ్రద్ధలతో బోనమెత్తుకున్న కవలలు
- బోనాల పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చిన్నారుల సందడి





**కోహిర్, ఆగస్టు 8 (జనంసాక్షి):** బోనాల పండుగ సందర్భంగా చిన్నారులైన కవలలు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై, తలపై బోనమెత్తుకుని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. పసుపు, కుంకుమలతో సుందరంగా అందమైన పుష్పాలంకరణతో బోనం చూపరుల దృష్టిని ఆకర్షిస్తూ పండుగ శోభను మరింత పెంచింది. బోనాలను తలపై ధరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించేందుకు సిద్ధమయ్యారు.
కవల చిన్నారుల సంప్రదాయ వేషధారణ, తలపై బోనాలతో నిలిచిన దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. పండుగ సందర్భంగా పల్లవి మోడల్ స్కూల్ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించడం ద్వారా కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కలగాలని ప్రార్థించారు. పుష్పాలతో అందంగా అలంకరించిన బోనాలు, సంప్రదాయ వాతావరణం పండుగ శోభను మరింత పెంచాయి